పల్లె వైద్యానికి చంద్ర గ్రహణం


వరదయ్యపాళెం మండలం బత్తలవల్లంలో మూతపడిన విలేజ్ హెల్త్ క్లినిక్


నాగలాపురంలో తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

గ్రామీణ ప్రాంత ప్రజలకు నిత్యం వైద్య సేవలందించే విలేజ్ క్లినిక్‌లు మూతపడ్డాయి. సీహెచ్‌ఓలు (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్) తమ సమస్యలు పరిష్కరించాలంటూ విధులను బహిష్కరించారు. ఐదు రోజులుగా తిరుపతిలోని కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. సత్యవేడు నియోజకవర్గంలోని 71 మంది సీహెచ్‌ఓలు సమ్మెలో ఉండడంతో విలేజ్ క్లినిక్‌లలో వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు దూరమవడంతో అవస్థలు పడుతున్నారు.

- కూటమి ప్రభుత్వంపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల తిరుగుబాటు
- ఐదు రోజులుగా విధుల బహిష్కరణ
- కలెక్టరేట్ల వద్ద కొనసాగుతున్న నిరసనలు
- ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కరించాలని డిమాండ్
- సూపర్‌వైజర్ల విలేజ్ క్లినిక్‌ల బాధ్యతలను అప్పగించే యోచనలో ప్రభుత్వం
- గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందక ఇక్కట్లు

వరదయ్యపాళెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి కాకుండానే సామాన్య ప్రజల నుంచి అధికారుల వరకు అన్ని వర్గాల వారు తిరుగుబాటుకు దిగుతున్నారు. మొన్నటి వరకు అంగన్‌వాడీలు సమ్మె చేయగా.. తాజాగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. గత 5 రోజులుగా తిరుపతి కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 71 గ్రామ సచివాలయాల పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. అందులో సగానికి పైగా పక్కా భవనాలు లేని కారణంగా అద్దె భవనాల్లో క్లినిక్‌లను కొనసాగిస్తున్నారు. ఏ శాఖలో ఏ ఉద్యోగులు కూడా చేయని విధంగా అద్దె భవనాలకు సీహెచ్‌ఓలు అద్దెలు భరిస్తున్నారు. ఏడాదిగా సీహెచ్‌ఓలు ఇలా తమ జీతాల నుంచి అద్దె చెల్లిస్తున్నారు. క్లినిక్‌కు సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు మొత్తంగా రూ.36 వేల నుంచి రూ.40 వేల వరకు ఇప్పటివరకూ అద్దెలు చెల్లించారు. అలాగే విద్యుత్ బిల్లులు అదనంగా చెల్లిస్తున్నారు. ముందు వీరి అద్దెలు చెల్లిస్తే తర్వాత ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల చేస్తుంటారు. అయితే ఏడాదిగా అద్దె బకాయిలు రావాల్సి ఉందని సీహెచ్‌ఓలు అంటున్నారు.

సూపర్‌వైజర్లపై భారం ..

ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లతో విలేజ్ క్లినిక్‌లను నడిపించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసి విధులు అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ నిర్ణయం తమకు మరింత భారమని సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఆవేదన చెందుతున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూతపడడంతో పెద్దాస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

సీహెచ్‌ఓల డిమాండ్లు ఇవీ..

- 6 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయాలి
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలి
- పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరించాలి
- ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలి.
- క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలి
- నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలి
- ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలి
- ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలి.

క్లినిక్‌లకు అద్దె కడుతున్నాం..



మా జీతం నుంచే క్లినిక్‌కు అద్దె కడుతున్నాం. మందులకు రవాణా ఖర్చులు, విద్యుత్ బిల్లులు కూడా భరిస్తున్నాం. మాకు పనికి తగిన వేతనం, ప్రమాదవశాత్తూ చనిపోతే కుటుంబాన్ని ఆదుకోవడానికి ఎక్స్‌గ్రేషియా, అలాగే మిగిలిన న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ నిరసనలు చేపట్టాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– హాలేఖ్య, సీహెచ్‌ఓ, కృష్ణాపురం, నాగలాపురం మండలం

ఉద్యోగ భద్రత కల్పించాలి..



ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం కోతలు లేకుండా జీతం ఫిక్స్‌డ్‌గా ఇవ్వాలి. క్లినిక్‌ల వద్ద రక్షణ చర్యలు కల్పించాలి. ఆగస్టు 2022న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో తమ పోస్టు రెగ్యులర్ మేరకు సర్వీసులు క్రమబద్ధీకరించాలి.

– ఫిబా, సీహెచ్‌ఓ, ఎస్‌ఎస్‌పురం, నాగలాపురం

క్లుప్తంగా

వేదనారాయణ స్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ధర్మరక్షణ సమితి సభ్యులు

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లీ సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వేదనారాయణ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అధికారి చెంగల్‌రాయులు తెలిపారు. తమిళనాడులోని అంజికర్రై ప్రాంతానికి చెందిన ధనశేఖర్, వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాటు చేసి స్వామి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్యులు, ధర్మరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి బస్టాండ్‌లో నిఘా కరువు


తాళాలు లేని షట్టర్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి బస్టాండులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. శ్రీకాళహస్తి బస్టాండులో నిత్యం సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. పోగొట్టుకున్న వారు అక్కడి ఆర్టీసీ సిబ్బందిని సీసీ ఫుటేజీల ద్వారా చోరీ దృశ్యాలను చూసి తెలుసుకోవాలని కోరగా తమ వద్ద లేవని వారు సమాధానం ఇస్తున్నారు. అంతేగాకుండా బస్టాండు ఆవరణలో ఉన్న దుకాణాల షట్టర్లను కొంతమంది దుండగులు పగులగొట్టి అందులోని వస్తువులు, డబ్బును దోచుకెళ్తున్నారు. దుకాణ షట్టర్లు పగలగొడితేనే దిక్కు లేకపోతే సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ప్రయాణికుల పరిస్థితి ఏమిటని పలువురు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పట్టణంలో పర్యటన


చిరు వ్యాపారస్తులకు సూచనలు ఇస్తున్న సీఐ జయచంద్ర

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట నూతన సీఐ జయచంద్ర ఆదివారం రేణిగుంట పట్టణంలో పర్యటించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా బస్టాండు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో రోడ్డుపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారస్తులకు సూచనలు చేశారు. వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారం చేసుకోవాలన్నారు.

ముక్కంటిసేవలో పెద్దాపురం ఎమ్మెల్యే


ఆలయం వెలుపల ఎమ్మెల్యే చిన్నరాజప్ప

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నారావు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

నారాయణవనం: మండలంలోని అరణ్యంకండ్రిగ విలేజ్ క్లినిక్‌ను, పుత్తూరు–నాగలాపురం రోడ్డు నుంచి అరణ్యంకండ్రిగ వరకు వేసిన సీసీ రోడ్డును సోమవారం ఉదయం 9.30 గంటలకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభిస్తారని ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన


కళ్లను పరీక్షిస్తున్న డాక్టర్లు

నాగలాపురం: పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వారు తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామనాయుడు పర్యవేక్షణలో పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రోగులకు సీనియర్ వైద్యనిపుణులైన అనుభవం గల స్పెషలిస్ట్ డాక్టర్లు కళ్ల పరీక్షలు చేశారు. ఈ మేరకు 180 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అందులో 60 మందికి మందులు, 40 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 70 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు ట్రస్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఏఓ కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్, సాయిబాబా ఆలయ ప్రతినిధులు జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.

అనుకోని అతిథిలా వాన..


బుచ్చినాయుడుకండ్రిగలో పడుతున్న వర్షం


వరదయ్యపాళెంలో జోరు వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: అనుకోని అతిథిలా వరుణదేవుడు వచ్చాడు. గత కొన్ని రోజులుగా భానుడి ప్రతాపానికి ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనానికి కాస్త ఉపశమనం కల్పించాడు. మండలంలో ఆదివారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. భారీ ఈదురు గాలులకు వాతావరణం చల్లబడింది.

రాజుల కండ్రిగలో వడగండ్ల వర్షం

నాగలాపురం: మండలంలో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ మేరకు రాజుల కండ్రిగ గ్రామంలో వడగండ్ల వాన పడింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం కురిసిన ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై వర్షం పడడంతో ప్రజలకు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించింది. గత కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ వర్షంతో వాతావరణం చల్లబడింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో ఈ వర్షం రైతులకు వ్యవసాయ పనులు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.


రక్తదానం.. ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువత


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో యువతరం సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 58 మంది యువకుల విచ్చేసి రక్తదానం చేశారు. రక్తదాతలకు ఆర్డీవో చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతరం సేవా సమితి వారు గత పదేళ్లుగా వేసవికాలంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ఒక బాధ్యతగా భావించి ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం ఒకరి ప్రాణాన్ని నిలబెట్టడమేనని తెలియజేశారు. యువతరం సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ వేసవికాలంలో రక్త కొరతతో ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గత కొన్నేళ్లుగా వేసవికాలంలోనే రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రాజేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు స్వర్ణమూర్తి, కల్పన యువతరం సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

శేషవాహనంపై అగస్తీశ్వరుడి చిద్విలాసం


శేష వాహనంపై దర్శనమిస్తున్న అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధంగా ఉన్న మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు శేష వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో అర్చకులు నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, కోలాటాల నడుమ సముదాయం వీధుల్లో శేషవాహనంపై అగస్తీశ్వరుడు విహరిస్తూ హారతులను అందుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఆలయాల ఏఈఓ రవి, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుక్కల్, గౌతం గురుక్కల్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో అయిదో రోజు సోమవారం సాయంత్రం అగస్తీశ్వరస్వామి నంది వాహనంపై ఊరేగనున్నారు.

ఘనంగా ఒడుగులు


ఉచిత ఒడుగులు కార్యక్రమానికి పిల్లలతో హాజరైన ముస్లింలు

శ్రీకాళహస్తి: హజరత్ మహాబూబ్ సుభాని రహో నిషాన్ ముతవల్లి షేక్‌మీర్జాన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఒడుగులు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అహమ్మద్ బాషా పిల్లలకు ఒడుగులు చేశారు. ఈదులగుంట షాదీమహల్‌లో ఈ కార్యక్రమంలో జరిగింది. ఒడుగులు చేయించుకున్న పిల్లలకు పండ్లు, బ్రెడ్, మందులు సరఫరా చేశారు. గత 26 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ముతవల్లి షేక్ మీర్జాన్ సాహెబ్ తెలిపారు. కార్యక్రమంలో ఎక్ట్ యాంటీ కరప్షన్ ప్రెసిడెంట్ లాలూ ఇస్మాయిల్, సెక్రటరీ ఆరిఫ్, ఎక్ట్ యాంటీ కరప్షన్ మీడియా ప్రెసిడెంట్ యాసిన్, ఖాదర్ బాషా, ముజీబ్ సాదిక్ కాలేషా, సలీం పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



బీసీ కాలనీ యువకులతో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర, డాబా నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న సీఐ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర కోరారు. ఆదివారం ఆయన రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట బీసీ కాలనీలో పర్యటించారు. స్థానికంగా ఉన్న యువకులతో సమావేశమై ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం హైవేలో ఉన్న దాబాల్లో తనిఖీలు చేశారు. అనంతరం దాబా నిర్వాహకులతో మాట్లాడుతూ దాబాలకు వచ్చే వారి వాహనాలను హైవేపై పార్కింగ్ చేయకుండా చూడాలని సూచించారు. రాత్రి వేళ సకాలంలో డాబాలు మూసివేయాలని, మద్యం తాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ చంగ్రాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోలి సమాజ్ ఏపీ జాయింట్ సెక్రటరీగా శివకుమార్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ముదిరాజ్ కమ్యూనిటీకి సంబంధించి న్యూఢిల్లీలో ఉన్న అఖిల భారతీయ కోలి సమాజ్‌కు సంబంధించి ఏపీ రాష్ట్ర కమిటీని ఆదివారం ప్రకటించారు. అందులో రేణిగుంట మండలం గురవరాజుపల్లి పంచాయతీ రామకష్ణాపురానికి చెందిన పోలీ శివకుమార్ ముదిరాజ్‌ను రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా పలువురు శివకుమార్‌ని అభినందించారు. ముదిరాజుల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అరుంధతివాడలో కార్డన్ సెర్చ్


పట్టుబడిన వాహనాలను చూపుతున్న ఎస్‌ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని అరుంధతివాడలో ఆదివారం ఉదయం ఎస్‌ఐ విశ్వనాథనాయుడు సిబ్బందితో కలసి కార్డన్ సెర్చ్ చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా లేని వాహనాలు ఎక్కువగా ఉండడంతో వాటిని గుర్తించడానికి కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. రికార్డులు లేని వాటిని స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. కొందరు తెలియక తక్కువ ధరకే చోరీ వాహనాలను కొనుగోలు చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. రికార్డులు లేని రెండు బైక్‌లను సీజ్ చేశారు.

భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టులో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అర్చకులు నిరంజనాచార్యులు, గ్రామస్తులు టీటీడీ నుంచి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. అందుకు ఆయన స్పందిస్తూ దరఖాస్తు చేసుకుంటే ఇప్పిస్తానన్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: వృద్ధులు, దివ్యాంగులకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులుమునీర్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని నగరివీధిలో వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ నిస్వార్థంగా పేదలకు సేవలు అందిస్తోందన్నారు. ఈ సంస్థ మరిన్ని సేవలు అందించేందుకు నియోజకవర్గంలోని పరిశ్రమలతో చర్చిస్తామన్నారు. ఈ సంస్థకు తన వంతుగా రూ.లక్ష విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ధనికులు హెల్పింగ్‌హ్యాండ్స్ వ్యవస్థాపకులు మునీర్‌బాషాను ఆదర్శంగా తీసుకుని పేదలకు తమవంతు సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

అలుసుపాళెంలో తాగునీటి ఎద్దడి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీలోని అడుసుపాళెం గ్రామంలో గత ఐదు రోజులుగా నీళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న పంచాయతీ బోరు మరమ్మతులకు గురికావడంతో నీటి ఇబ్బంది ఏర్పడింది. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్య గురించి తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగయ్య ఆదివారం తన సొంత డబ్బుతో టాంకర్లతో నీటి సరఫరా చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని అధికారులు పంచాయతీ బోరును మరమ్మతు చేసి అదనంగా మరో బోరు వేయాలని స్థానికులు కోరుతున్నారు.


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు


రేణిగుంట రైల్వేస్టేషన్ ముందు రోడ్డుపై నిలిచిన మురుగు నీరు,


బస్టాండ్ ముందు ఇలా..

వర్షం వచ్చే.. కంపు తెచ్చే..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): చినుకు పడితే రేణిగుంట రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డంతా మురుగునీటితో నిండిపోతుంది. ఆదివారం మధ్యాహ్నం పడిన వానకు రోడ్డుపైకి మురుగునీరు చేరింది. బస్టాండ్ నుంచి ఉన్న ప్రధాన కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. వర్షం పడిన ప్రతిసారి వర్షపునీటితో మురుగు నీరు రోడ్లపైకి చేరుతుంది. ప్రధాన కాలువను శుభ్రం చేయిస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. దీంతో వర్షం వచ్చిన ప్రతిసారి సమస్య పునరావృతమవుతోంది. రోడ్లపై మురుగునీరు నిలుస్తుండడం వల్ల వ్యాపారస్తులు, బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు మురుగునీటిలోనే వెళ్లాల్సిన దుస్థితి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.